# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-08-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **విశాఖపట్నంలో గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనలో మృతి చెందినవారి కుటుంబాలకు 10 లక్షల పరిహారాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.**

**2.** **రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**

**3.** **అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు.**

**4.** **ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటించనున్నారు.**

**5.** **భారత స్వాతంత్ర్య సంగ్రామంలో చివరిఘట్టమైన క్విట్ ఇండియా ఉద్యమానికి ఈ రోజుతో 83 సంవత్సరాలు పూర్తయ్యాయి.**

=========================

విశాఖపట్నంలో గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు మృతుల కుటుంబాలకు 10 లక్షల రూపాయల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. నిన్న సాయంత్రం విశాఖపట్నంలోని ఫిషింగ్ హార్బర్ సమీపంలోని ఒక వెల్డింగ్ దుకాణంలో గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురు మృతి చెందగా మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

------------------------------

రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలో పెన్నా నది వద్ద ఉన్న శ్రీతల్పగిరి రంగనాథస్వామి ఆలయ ఘాట్ ను అధికారులతో కలిసి ఆయన ఈరోజు పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలు అభివృద్ధి చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా రంగనాథస్వామి ఆలయ ఘాట్ ను అన్ని విధాలా ఆధునికరించి డిసెంబర్ నాటికి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఈ ప్రాంతంలో బోటింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు.

------------------------------

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఆయన నిన్న మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను ఇప్పటికే అమలు చేశామని తెలిపారు. ఉచిత బస్సు హామీని కూడా అమలు చేయనున్నామని పేర్కొంటూ...

వాయిస్...30 సెకన్లు

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మహిళలకు వరలక్ష్మీ వ్రతం శుభాకాంక్షలు తెలిపారు.

మరోవైపు.. రాష్ట్రంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో అమ్మవారు వరలక్ష్మీ అవతారంలో దర్శనమిస్తున్నారు.

విశాఖపట్నంలోని శ్రీ కనకమహాలక్ష్మీ ఆలయంలో ఈరోజు సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అలాగే తిరుపతి జిల్లా తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు.

---------------------------

అనంతపురం జిల్లా వ్యాప్తంగా హర్ ఘర్ తీరంగా కార్యక్రమం పై అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామని అనంతపురం రెవిన్యూ డివిజన్ అధికారి –ఆర్డీఓ కేశవ నాయుడు తెలిపారు. అనంతపురం నగరంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీని కేశవ నాయుడు ప్రారంభించారు. ఈ ర్యాలీ అనంతపురం టవర్ క్లాక్ నుండి ప్రారంభమై సప్తగిరి సర్కిల్ మీదుగా నగరపాలక సంస్థ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో అనంతపురం డివిజన్ వ్యాప్తంగా జాతీయ జెండా విశిష్టతను తెలియజేస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

---------------------------

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటించనున్న వంజంగి గ్రామంలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ కలెక్టర్‌తో కలిసి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ సావడి వద్ద గిరిజన సంప్రదాయాలతో జరిగే పండగల ప్రదర్శనలో ముఖ్యమంత్రి పాల్గొంటారని చెప్పారు. గ్రామ సచివాలయం సమీపంలో కాఫీ తోటలను పరిశీలించి రైతులతో సంభాషిస్తారని చెప్పారు. అనంతరం లగిశపల్లి కస్తూర్బా విద్యాలయం సమీపంలో ఏర్పాటుచేసిన సభలో పాల్గొంటారని కలెక్టర్ పేర్కొన్నారు.

---------------------------

గుంటూరు నగరంలోని శంకర్ విలాస్ పైవంతెన కూల్చివేత పనులు ప్రారంభమైన నేపథ్యంలో ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపు అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ స్పష్టం చేశారు. గుంటూరులో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రేపటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు అమలు చేయనున్నామని చెప్పారు. పై వంతెన పనులు పూర్తయ్యేవరకు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని ప్రజలు సహకరించాలని ఎస్పీ పేర్కొంటూ,

వాయిస్ .. 27 సెకన్లు

---------------------------

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో చివరిఘట్టమైన క్విట్ ఇండియా ఉద్యమానికి ఈ రోజుతో 83 సంవత్సరాలు పూర్తయ్యాయి. 1942 ఆగస్టు 8వ తేదీన ముంబైలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభలో జాతిపిత మహాత్మాగాంధీ ప్రసంగిస్తూ, బ్రిటిష్ ప్రభుత్వం భారత్‌ను వదిలివెళ్లాలని హెచ్చరించారు. అందుకు అనుగుణంగా జాతియావత్తు ఉద్యమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. ఆ మహనీయుని పిలుపుతో దేశవ్యాప్తంగా నిరసన ఉద్యమాలు ఉవ్వెత్తున లేచాయి. ఉద్యమాన్ని అణచివేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం జాతీయ నాయకులను పెద్ద సంఖ్యలో జైళ్ళకు తరలించింది. అయినప్పటికీ క్విట్ ఇండియా ఉద్యమం కొనసాగడంతో బ్రిటీష్ ప్రభుత్వం భారత్‌కు స్వాతంత్ర్యాన్ని ప్రకటించింది.

---------------------------

ఖరీఫ్ పంట కాలంలో శ్రీకాకుళం జిల్లాలో 4 లక్షల 10 వేల ఎకరాల్లో పంటలు సాగు చేసేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కె త్రినాథ స్వామి తెలిపారు. శ్రీకాకుళంలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, రైతులకు అవసరమైన ఎరువులకు కొరత లేదని సరిపడా నిల్వలు ఉన్నాయని చెప్పారు. జిల్లాలో మొక్కజొన్నతో పాటు వరి పంట సాగు అవుతోందని ఆయన తెలుపుతూ...

వాయిస్ ..32 సెకన్లు

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 498 పాయింట్ల నష్టంతో 80 వేల 125 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 153 పాయింట్ల నష్టంతో 24 వేల 443 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, దీని ప్రభావంతో ఈనెల 13వ తేదీ నాటికి బంగాళాఖాతంలో అల్పపడీనం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో రాష్ట్రంలో రాబోయే రెండు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి బి.శేఖర్ తెలియజేస్తూ....

వాయిస్...20 సెకన్లు

=====================